క్లుప్తంగా

రక్షిత మంచి నీరు అందించడమే లక్ష్యం



నందంపూడిలో మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరోవర్

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యమని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. వాకలగరువు, నందంపూడి గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. అనంతరం మంచినీటి ట్యాంకు క్లీనింగ్‌ను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఆదుర్రుకు చెందిన బాలుడికి సహాయం అందిస్తున్న రోటరీ ప్రెసిడెంట్ కవీంద్ర

మామిడికుదురు: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రాజోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మామిడికుదురు మండల పరిధిలోని ఇద్దరు రోగులకు ఆర్థిక సాయం అందించారు. ఆదుర్రు గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలుడు కొంబత్తుల రాకేష్ మోకాలి సమస్యతో బాధపడుతున్నాడు. అతని సర్జరీ ఖర్చులకు రూ.10 వేలు అందించారు. పక్షవాతంతో బాధపడుతున్న మామిడికుదురు శివారు ఈర్ల చెరువుకు చెందిన ముషినే సత్యనారాయణకు రూ.5 వేలు ఇచ్చారు. రొటేరియన్ మహ్మద్ మొహిద్దీన్ రూ.2 వేలు అందించారు. కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఏడిద కవీంద్ర, కార్యదర్శి చిట్టినీడి లక్ష్మణరావు, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, నార్కెడిమిల్లి బాలకృష్ణ, యెనుముల వెంకట రమణ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్లపై చర్యలు తప్పవు



వాకలగరువులో ఆర్వో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో సరోవర్

అంబాజీపేట: ప్రభుత్వ అనుమతితో పాటు నిబంధనలు పాటించని ఆర్వో ప్లాంట్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జీవీ సరోవర్ హెచ్చరించారు. ఈ నెల 16వ తేదీన సాక్షి దినపత్రికలో 'నాణ్యతకు నీళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వాకలగరువులో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడిపే ప్లాంట్లను గుర్తించి సీజ్ చేస్తామన్నారు. మండలంలోని ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

రామారావు మృతి కళారంగానికి తీరని లోటు



రామారావుకు నివాళులర్పిస్తున్న అప్పనపల్లి గ్రామస్తులు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామానికి చెందిన రంగస్థల నటుడు, సంగీత వాయిద్యకారులు, గాయకులు కాజులూరి రామారావు మృతి కళా రంగానికి తీరని లోటని స్థానిక సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, మాజీ సర్పంచ్ పిచ్చుక చిన్న, కళాకారుల సంఘం అధ్యక్షులు కంకిపాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అప్పనపల్లి శుభోదయ కళా వేదిక వద్ద ఆదివారం రామారావు చిత్రపటానికి కళాకారులు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లూరు పద్మనాభరాజు, తులా గోపాలకృష్ణ, బత్తుల జనార్ధనరావు, కడలి చిన సత్యనారాయణ, తులా బ్రహ్మజీ పాల్గొన్నారు.

వానాకాలం.. పశువులు జాగ్రత్త

- సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం
- నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకే ముప్పు



మొసలపల్లిలో వరి చేలో మేస్తున్న గొర్రెలు, మేకలు

అంబాజీపేట: వానాకాలం రావడంతో గొర్రెలు, మేకలు, జీవాలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. జీవాలకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే సకాలంలో అందుబాటులో ఉన్న పశువైద్యాధికారిని సంప్రదించి సరైన చికిత్స చేయించాలని సూచిస్తున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారుగా 11,200 గొర్రెలు, మేకలు ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో జీవాలకు వచ్చే ఏయే వ్యాధులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పశు వైద్యులు వివరిస్తున్నారు.

బ్లూటంగ్ వ్యాధి

గొర్రెలు, మేకల్లో బ్లూటంగ్ వ్యాధులు సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, పెదవులు దద్దరించడం, నోటిలోపల పుండ్లు, ముక్కులో చీమిడి, కాళ్లు కుంటడం, ఒంట్లో నీరు చేరడం, పారుకోవడం, మేత మెయ్యకపోవడం, అలాగే ఈసుకుపోవడం (అబార్షన్లు) వంటి లక్షణాలు ఉంటాయి. వీటి నివారణకు సాయంత్రం సమయంలో గొర్రెల మందలో వేపాకు పొగ పెట్టుకుంటూ అప్పుడప్పుడూ బ్లూటాక్స్, టిక్కిల్ మందులు పిచికారీ చేయాలి.

కాళ్లపుండ్లు వ్యాధి

జీవాలకు కాళ్లపుండ్లు వ్యాధి సోకితే కాలి గిట్టల మధ్య చీము చేరి చెడు వాసన వస్తుంది. అలాగే గొర్రె లు కుంటుతూ నడుస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తున్నప్పుడు జీవాలను బురద ప్రాంతంలో మేపకూడదు. పొడి ప్రాంతంలోనే మేత వేసే విధంగా చూడాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

గొంతువాపు వ్యాధి

పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రమాదకరమైంది. ఈ వ్యాధిని గురక వ్యాధి అని కూడా పిలుస్తారు. తొలకరి వర్షాలు పడిన సమయంలో కలుషితమైన నీటి ద్వారా, మేత ద్వారా పశువులకు రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల ఈ వ్యాధి బారిన పడతాయి. గొంతువాపు వ్యాధి బారిన పడిన పశువులను మిగిలిన పశువులతో కలిపి ఉంచితే వ్యాధి మిగిలిన పశువులకు కూడా వ్యాప్తి చెందుతుంది. వ్యాధిసోకిన పశువులను మిగిలినవాటి నుంచి వేరు చెయ్యాలి. జూన్, జులై, ఆగష్టు నెలలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పౌష్టికాహారం అందించాలి.

చిటిక వ్యాధి

ఎంటరోటాక్సీమియా అనే బ్యాక్టీరియా వల్ల తొలకరి వర్షాలు కురిసే సమయంలో ఏడాది వయసున్న గొర్రెలలో చిటిక వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు నీరసిస్తాయి. కొద్దిసేపటికే గిలగిలా కొట్టుకుని మరణిస్తాయి. ఈ వ్యాధి లక్షణాలు ఉదయం, మధ్యాహ్న వేళల్లో గొర్రెలలో కనిపిస్తాయి. వర్షాలకు ముందే గొర్రెలకు ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయించాలి.

ముందస్తు జాగ్రత్తలు అవసరం



వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందుగానే టీకాలు వేయించడం ఉత్తమం. నిర్లక్ష్యం చేస్తే పశువుల ప్రాణాలకు ప్రమాదం. పశువులకు సోకే వ్యాధులను గుర్తిస్తే దగ్గరలో ఉన్న పశువుల ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం అందించాలి.

– డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్, పశువైద్యాధికారి, అంబాజీపేట

గజమాల యాత్ర ద్వారా ఐక్యతను చాటుదాం



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి ఆలయ వ్యవస్థాపకులు మొల్లేటి రామస్వామి, ఆదిలక్ష్మి దంపతుల మెడలో ఆవిష్కరించే గజమాల యాత్ర సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తాటిపాకలోని రాజోలు తాలూకా శెట్టి బలిజ సంఘం భవనం నుంచి ప్రారంభమవుతుందని మండల శెట్టి బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్ తెలిపారు. మామిడికుదురు బీసీ సంక్షేమ సంఘం భవనం వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ గజమాల యాత్రలో సంఘీయులతో పాటు రామస్వామి అభిమానులు పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. సమావేశంలో వాసంశెట్టి శంకరరావు, నయినాల సత్యనారాయణమూర్తి, జోగి వెంకటరామకృష్ణ, పెచ్చెట్టి సత్యచంద్ర, కడలి నూకరాజు, నయనాల రామకృష్ణ, బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీ



అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఉత్సవ కమిటీ సభ్యులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది మంది సభ్యులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తూ ఎండోమెంట్ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ సభ్యులుగా తులా ఉమామల్లేశ్వర స్వామి, బొంతు ఆనందరావు, పడవల వీవీఎస్ మల్లేష్, కామిశెట్టి సూర్యచంద్ర, మాకే సత్యశ్రీధర్, కోలా రాంబాబు, పాటి వెంకట్రావు, కేతా శ్రీనివాస్, కంకిపాటి సుబ్బారావును నియమించారు. కమిటీ సభ్యులు ఆదివారం బాల బాలాజీ స్వామిని దర్శించుకుని బాధ్యతలు చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి సభ్యులకు స్వామి వారి కండువాలు కప్పి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అడబాల తాతకాపు, జాలెం శ్రీనివాసరాజా, మొల్లేటి శ్రీనివాస్, తులా బ్రహ్మజీ, బొంతు భాస్కరరావు, కంకిపాటి నరసింహారావు, కొమ్ముల జంగమయ్య, గుబ్బల దుర్గ పాల్గొన్నారు.

నేడు వేణుగోపాలస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ర్యాలి వేణుగోపాలస్వామి

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అలాగే పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి గ్రామంలో వేంచేసిన వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాలు కన్నులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. ఈ నెల 17 నుంచి 23 వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. స్వామి వారి కల్యాణోత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ఖరీఫ్ సాగు పనుల్లో రైతుల నిమగ్నం



కె.పెదపూడిలో నారుమడి సిద్ధం చేసిన రైతు

అంబాజీపేట: పంట కాలువలో నీరు విడుదల చేయడంతో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించేందుకు రైతులు సమాయత్తమయ్యారు. మండలంలో 1300 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. మండలంలో కె.పెదపూడి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, ఇరుసుమండ, మొసలపల్లి, ముక్కామల, కముజువారిలంక, వక్కలంక, పసుపల్లి, ఇసుకపూడి, చిరతపూడి గ్రామాల్లో రైతులు వరి విత్తనాలు వేశారు. పంట నూర్పిడికి చేనును సిద్ధం చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో వరి నారుమడులు వేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ప్రాంతానికి అనుకూలమైన ఎంటీయు 7029, 1064, 1318 రకాలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు.

బాధితుడికి చేయూత



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: విద్యుత్ ప్రమాదంలో గాయపడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆర్థిక చేయూతను అందించారు. తూర్పుగోదావరి జిల్లా నర్సిపూడి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్ తాపీ మేస్త్రిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 20 రోజుల క్రితం బిల్డింగ్‌పై కరెంట్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌తో పై నుంచి కింద పడిపోయాడు. ఎడమ చెయ్యి, నడముకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో వైద్యానికి ఇప్పటి వరకూ రూ.1.50 లక్షలు ఖర్చు పెట్టారు. ఇంకా సర్జరీలు చెయ్యాల్సి ఉంది. అంత స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు స్పందించి దుర్గా ప్రసాద్‌కు రూ.21 వేలను ఆదివారం ఆర్థిక సాయంగా అందజేశారు. కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలసిన 1989 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మామిడికుదురు: మూడున్నర దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనానికి లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా నిలిచింది. 1989లో లూటుకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తాము చదుకున్న పాఠశాలలోనే ఆదివారం తిరిగి కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. తమకు ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన చక్కటి విద్యను అందించడంతోనే తామంతా ఉన్నత స్థానాల్లో ఉన్నామంటూ ఆనంద పరవశులయ్యారు. తమ తమ కుటుంబ నేపథ్యాలు ఒకరితో మరొకరు పంచుకుని ఆత్మీయ బంధాన్ని చాటుకున్నారు.

గ్యాస్ విస్ఫోటనాలతో కోనసీమ ఎడారిగా మారుతోంది



చింతలపల్లిలో గ్యాస్ లీకైన బోరుబావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

రాజోలు: ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల కార్యకలాపాలతో పాటు తరచూ జరుగుతున్న గ్యాస్ విస్ఫోటనాలతో కోనసీమ సహారా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం చింతలపల్లి గ్రామంలో బోరు బావి నుంచి గ్యాస్ లీకైన ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. కోనసీమ ప్రాంతాల్లో బోరు వేసుకోవాలంటే ప్రజలు భయపడుతున్నారన్నారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు భూమిలో వేసిన కాలం చెల్లిన పైపులైన్లను మార్చాలన్నారు. గ్యాస్ లీకేజీల కారణంగా పచ్చని పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది కుడిపూడి త్రినాథ్, కరుణాకర్, చెల్లుబోయిన వెంకటరమణ, కట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం



దాత కోమలా ఫణికి స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన చిలుకుల కోమలా ఫణి ఆదివారం రూ.10,116 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఈతకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. ఈతకోట సెక్షన్ పరిధిలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీ పోలవరం, పొడగట్లపల్లి, మట్లపాడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మంత్రి సుభాష్‌కు ఘనస్వాగతం



రావులపాలెంలో మంత్రి సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా రామచంద్రపురం నియోజకవర్గానికి వస్తున్న కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆదివారం రావులపాలెం సెంటర్‌లో ఘన స్వాగతం లభించింది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. క్రేన్‌తో భారీ గజమాలను వేసి సత్కరించారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత పుస్తకాల పంపిణీ

రాజోలు: త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను కూనవరంలో ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మల గురించి తెలుసుకోవడం ద్వారా ధర్మ స్థాపన జరుగుతుందన్నారు. మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, హనుమంతరావు, బ్రహ్మజీ, సుబ్బారావు, శేషు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పి.గన్నవరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. పి.గన్నవరం ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న బెల్లంపూడి వద్ద ఎదురెదురుగా మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో బోడపాటి వారిపాలెంనకు చెందిన బోడపాటి మూల బాలాజీ (33) తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాలాజీ మృతదేహానికి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక నిల్వలు తరలిస్తున్నవారిని శిక్షించాలి

ప్రజాప్రతినిధుల డిమాండ్

కపిలేశ్వరపురం: అక్రమాలకు అడ్డుకట్ట వేస్తామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు మండలంలోని ఇసుక నిల్వలను అక్రమంగా తరలిస్తున్నారని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు విమర్శించారు. కపిలేశ్వరపురంలో ఆదివారం ఎంపీపీ సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి సోనియా, పలివెల మధు, శీలం భాస్కరరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లోని ఇసుక ర్యాంపుల్లో వరదల కాలంలో వినియోగార్థం గత ప్రభుత్వం ఇసుక నిల్వలను ఉంచిందన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత కూటమి నేతల ప్రోద్బలంతో అక్రమంగా రాత్రి వేళ తరలిస్తున్నారన్నారు. లారీ రూ.12 వేల చొప్పున విక్రయిస్తున్నారని, ఈ విషయాన్ని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడంలేదని ఆరోపించారు. ఇసుక నిల్వలను విక్రయిస్తున్న అక్రమార్కులపై చట్ట పరిధిలో కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన ఇసుక విధానం ప్రకటించే వరకూ ఉన్నతాధికారులు స్పందించి ఇసుక నిల్వలను పరిరక్షించాలని కోరారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నవారిపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు విన్నవించినట్టు ఎంపీపీ తదితరులు చెప్పారు.

నకిలీపై జాగ్రత్త సుమీ!

- ఖరీఫ్ సాగుకు రైతుల సమాయత్తం
- ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోళ్లకు సన్నాహాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



ఆత్రేయపురంలోని ఎరువుల దుకాణం

ఆత్రేయపురం: వాతావరణం చల్లబడటంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం రైతులు సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల బెడద ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారిణి బి.మీనా సూచించారు. ఖరీఫ్ సాగు చేసే అన్నదాతలు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

ఎరువుల కొనుగోళ్లలో ..

లైసెన్స్ దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి. వాటి బిల్లులు, ఖాళీ సంచులు పంట కాలం పూర్తయ్యే వరకూ దాచుకోవాలి. మెషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే వాడాలి. ఒకవేళ చేతికుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు ఉత్పత్తి సంస్థ పేరు కచ్చితంగా ఉండాలి. కొనుగోలు సమయంలో డీలర్ రసీదుపై రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతకు సంబంధించి అనుమానాలు ఉంటే వెంటనే వ్యవసాయశాఖ అధికారుల సహకారంతో ఎరువుల పరీక్షలకు పంపాలి. చిల్లుపడిన, చిరిగిన బస్తాల్లోని ఎరువులు కొనుగోలు చేయకూడదు. అన్యపదార్థాలు కనిపిస్తే ఎరువులను కల్తీగా గుర్తించాలి.

పురుగు మందుల కొనుగోళ్లలో..

చీడపీడల నివారణకు వినియోగించే క్రిమి సంహారక మందుల కొనుగోళ్లలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు సూచించిన మందులను మాత్రమే వాడాలి. అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులు వాడకూడదు. లైసెన్స్ ఉన్న షాపుల్లోనే కొనుగోలు చేయాలి. పురుగు మందు డబ్బాపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలంరంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చరంగు గుర్తులు ఉంటాయి. పురుగు మందులు రెండు మూడురకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలు ధ్వంసం చేసి గుంతల్లో పూడ్చిపెట్టాలి. పురుగు మందుల వాడటానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించరాదు.

విత్తన కొనుగోళ్లలో..

వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోళ్లు చేసే సమయంలో బిల్లులో విత్తనం రకం, నంబర్, గడువు తేదీ, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం బిల్లులో ఉండేలా చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు , పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి కొనుగోలు చేయకూడదు. గడువు దాటిన విత్తనాలు జోలికి వెళ్లకూడదు. బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి. కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో ? లేదో ? నిర్ధారించుకోవాలి. విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలను తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను పరిశీలించాలి. మొలకెత్తే దశలో, పూత దశలో లోపాలు కనిపిస్తే వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంటకాలం పూర్తయ్యే వరకూ దాచి ఉంచాలి. విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని సరిచూసుకోవాలి. మొలక శాతం సంతృప్తిగా ఉన్న విత్తనాలనే వాడాలి.